క్లుప్తంగా

18 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపు

చినగంజాం: మండలంలో ఈ నెల 18 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏ. శ్రీనివాసమూర్తి తెలిపారు. 0 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు అంగన్ వాడీ సూపర్ వైజర్‌లు.. టీచర్‌లు ఈ నెల 18 నుంచి 21వ తేదీ.. 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే ఆధార్ మొబైల్ క్యాంపుల్లో ఆధార్ కార్డులు నమోదు చేయించుకునేలా సమాచారాన్ని అందరికీ తెలియజేయాలన్నారు.

ఆయా గ్రామ పంచాయతీల్లో క్యాంపు జరిగే సమయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆధార్ ఆపరేటర్‌లు (డిజిటల్ అసిస్టెంట్) ఇతర సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేయాలంటూ టామ్‌టామ్ వేయించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ సంతరావూరు, చినగంజాం, 19 చింతగుంపల్లె, పల్లెపాలెం, 20 గొనసపూడి, కొత్తపాలెం, 21 కడవకుదురు, రాజుబంగారుపాలెం, 24 మోటుపల్లి, మున్నంవారిపాలెం, 25 చింతగుంపల్లె, పెదగంజాం, 27 గొనసపూడి, పెదగంజాం, 28వ తేదీ కడవకుదురు, చినగంజాం గ్రామ పంచాయతీల్లో క్యాంపు జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేటపాలెం: మండలం పరిధిలోని తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ నెల 18 నుండి 28వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎం. రాజేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది గ్రామ పంచాయతీలను నాలుగు సెక్టార్లుగా విభజించి మండల పరిధిలోని నాలుగు ఆధార్ సెంటర్లు అనుసంధానం చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న విద్యార్థులు ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లో ఆధార్ నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

నేడు అభయాంజనేయ స్వామి ప్రతిష్ఠ వార్షికోత్సవం

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి వారి 21వ ప్రతిష్ఠా వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్యదర్శి జి.వెంకట సుబ్బారావు తెలిపారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, ఆకుపూజ, సాయంత్రం 6 గంటలకు పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

అంగన్‌వాడీలకు నేటి నుంచి శిక్షణ

బల్లికురవ: అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ, పఢాయిబీపై సోమవారం నుంచి బల్లికురవలో మూడు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీఓ డి. సుధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన కార్యకర్తలు సకాలంలో విధిగా శిక్షణలో హాజరు కావాలని కోరారు.

ఏ నిమిషం ఏమి జరుగునో!



స్వర్ణ నుంచి వచ్చే రహదారి వద్ద ప్రమాదకంగా మారిన వంతెన



కుంకలమర్రు వైపు వెళ్లే వాహనాలకు ప్రమాదకరంగా ..

- కోతకు గురవుతున్న కొమ్మమూరు కాలువ వంతెన
- ప్రమాదపుటంచున వాహనాలు
- ఆందోళనలో ప్రయాణికులు

కారంచేడు: నిత్యం వందల వాహనాలతో రద్దీగా ఉండే వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ ప్రధాన రహదారిలో కారంచేడు కాలువ సెంటర్ సమీపంలో ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా కట్టలకు సపోర్టుగా ఉండాల్సిన మట్టి కోతకు గురవ్వడంతో పాటు, మట్టి జారిపోవడంతో ప్రమాదకరంగా మారింది. రోడ్డులో ప్రయాణించే ఆటోలు, ద్విచక్రవాహనదారులు రోడ్డు అంచుగా ప్రయాణాలు చేస్తుంటారు. ఇలా ప్రయాణిస్తూ వచ్చే వాహనాలు వంతెన దగ్గరకు రాగానే అక్కడ కోతకు గురయిన కాలువ కట్టలు దర్శనమిస్తున్నాయి. ఒక వైపు కుంకలమర్రు వెళ్ళే కాలువ కట్ట ఉంటే, మరొక వైపు స్వర్ణ నుంచి కారంచేడుకు వచ్చే కట్ట ఉంటుంది. ఈ రెండు కట్టల వద్ద ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలు వంతెన వద్ద రోడ్డు ఎక్కే క్రమంలో అదుపుతప్పితే ఆ వాహనాలు కాలువలోకి పడిపోవడం ఖాయమని వాపోతున్నారు. వారం రోజుల క్రితమే ఇంకొల్లు నుంచి స్వర్ణ మీదుగా చీరాలకు వచ్చే ఆర్‌టీసీ బస్సు–పర్చూరు నుంచి కారంచేడు వస్తున్న టిప్పర్ లారీలు ఇక్కడే ఢీకొన్నాయి. ఈ ప్రమాదం జరిగినప్పుడు ఇరు వాహనాల డ్రైవర్‌లు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని, లేకుంటే ఈ వాహనాలు కొమ్మమూరు కాలువలోకి పడిపోయేవని అక్కడి స్థానికులు చెబుతున్నారు.

దీనికి తోడు ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగించే వారు అనేక మంది నివసిస్తున్నారని, వారి పిల్లలు కూడా అక్కడే ఆడుకుంటూ ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం కూడా లేకపోలేదని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వంతెనకు ఇరువైపులా రోడ్డుకు, వంతెనకు మధ్య కట్టలు పటిష్టం చేసి జరగబోయే పెను ప్రమాదంను తప్పించేలా కృషి చేయాలని ప్రయాణికులు, ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



గుడిపాడు కాలనీలో నిరంతరం వెలుగుతున్న వీధిలైట్లు

పగలే.. వెన్నెల!

బల్లికురవ: గ్రామ పంచాయతీలో పగలురాత్రి నిరంతరంగా లైట్లు వెలుగుతున్నాయి. మండలంలోని వి. కొప్పరపాడు, కొమ్మినేనివారిపాలెం, వెలమవారిపాలెం, కొత్తూరు, ముక్తేశ్వరం, మల్లాయపాలెం, ఉప్పుమాగులూరు, వేమవరం, సుజాతనగర్ కాలనీ కోటావారిపాలెం, సోమవరప్పాడు గ్రామాల్లో నిరంతం వెలగటంతో త్వరగా మాడిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోపాలు సరిచేయాలని.. రాత్రిళ్లు మాత్రమే వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు ఈ సందర్భంగా వేడుకుంటున్నారు.

తాళం వేశారు.. లైట్లు మరిచారు



ఆదివారం తాళం వేసి ఉన్న అద్దంకి మండల పరిషత్ కార్యాలయం

అద్దంకిరూరల్: అద్దంకి మండల పరిషత్ కార్యాలయానికి ఆదివారం తాళం వేశారు. కానీ లోపల మాత్రం లైట్లు వెలుగుతూ ఉన్నాయి. ఇలా సెలవు దినాల్లో కూడా కార్యాలయంలో లైట్లు వెలుగుతూ ఉండటం చూసిన స్థానికులు విద్యుత్‌ను ఆదా చేయాలంటూ అధికారులు చెప్పడమేకాని ఆచరించేది లేదన్నారు. శనివారం నుంచి ఇలాగే వెలుగుతున్నాయని తెలిపారు.



కార్యాలయం లోపల వెలుగుతున్న లైట్లు

వ్యవసాయ కూలీల ప్రాణాలతో చెలగాటం వద్దు



ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలను హెచ్చరిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

కారంచేడు: ఒక్కో ట్రక్కు ఆటోలో 25–30 మంది వ్యవసాయ కూలీలతో ప్రమాదకరమైన ప్రయాణాలు చేస్తూ వ్యవసాయ కూలీల ప్రాణాలతో చెలగాటమాడవద్దని ఎస్ఐ వి. వెంకట్రావు హెచ్చరించారు. ఆదివారం స్వర్ణ–దగ్గుబాడు రోడ్డులో సుమారు 30 మందికి పైగా వ్యవసాయ కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోను ఆపి డ్రైవర్‌కు తగు సూచనలు చేశారు. ప్రస్తుతం మిరప, శనగ, పొగాకు చేలల్లో వ్యవసాయ కూలీలు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ కూలీలకు డిమాండ్ కూడా బాగా ఎక్కువగా ఉంది. దీంతో రైతులు తమకు అవసరమైన కూలీలను ఇతర గ్రామాల నుంచి తెప్పించుకొని, పనులు పూర్తి అయిన తరువాత మరలా వారిని వారి ఊర్లకు తరలిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక్కో ఆటోలో పరిమితికి మించి కూలీలను ఎక్కిచడంతో పాటు, కాలువ కట్టలు, పొలాల గట్లు మీద ఆటోలు ప్రయాణించే క్రమంలో తిరగబడి ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడితే దానికి బాధ్యులు ఎవరని ఆయన ప్రశ్నించారు. ఆటో వాలాలు ఇష్టమొచ్చినట్లు ఎక్కించు వెళితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండో సారి పట్టుబడితే లైసెన్స్ సైతం రద్దు సిఫార్సు చేస్తామన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం చిత్త నక్షత్రం పంచమి తిధి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

శుద్ధ జలాలకు ప్రణాళిక

స్వర్ణ (కారంచేడు): గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం ఎప్పటికప్పుడు శుద్ధమైన తాగునీటిని అందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎస్. సతీష్‌చంద్ర అన్నారు. ఆదివారం స్వర్ణ, కారంచేడు గ్రామాల్లోని తాగునీటి శుద్ధి కేంద్రాలను ఆయన పరిశీలించారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామస్తులు శుద్ధమైన నీటిని మాత్రమే తాగేలా చెరువులు, వాటర్ ట్యాంక్‌లు, సంపులను క్లోరినేషన్ చేయించే పనులు ముమ్మరంగా చేపట్టామన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో నీటి తాగడం వలన ప్రజలు డయేరియా బారిన పడే ప్రమాదాలున్నాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందితో పాటు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల సమన్వయంతో ఎప్పటికప్పుడు సంపులు, వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించుకోవాలని ఆయన సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈఈ ఏ. కార్తీక్, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



స్వర్ణలో సంపులో క్లోరినేషన్ పరిశీలిస్తున్న డీఈఈ సతీష్‌చంద్ర

వైభవంగా వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో వరసిద్ధి వినాయకుడు

బల్లికురవ: బల్లికురవలోని వరసిద్ధి వినాయకుడి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సంకష్ట హర చతుర్థి వార్షికోత్సవంలో భాగంగా సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన వేదపండితులు చింతలపాటి సుబ్రమణ్యశర్మ బృందంచే పంచామృతాలతో అభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అర్చన, మండపారాధన, చతురావృత తర్పనం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం స్వామారికి నివేదించిన పండ్లు, ఫలహారాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ సన్నిధిలో అన్నసంతర్పణ చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది.

ఘనంగా బాబా అభిషేకాలు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు సాయి నగర్‌లో కొలువైన సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. గత వారం రోజుల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్థానిక హరేరామ ఆశ్రమ పీఠాధిపతులు ప్రణవానందగిరి స్వామివారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



కారంచేడులో అభిషేకం చేస్తున్న ప్రణవానందగిరి స్వామి

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ

కురిచేడు: స్థానిక జ్ఞానప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ఠాచార్యులు సాయినరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు, దేవులపల్లి విశ్వనాథం శాస్త్రి లు వేద మంత్రోచ్ఛరణలతో దక్షిణామూర్తి, చండీశ్వర, కాలభైరవ మూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కట్టమూరి నాగేశ్వరరావు, కొత్త వెంకట అయ్యపుశెట్టి, పోతిరెడ్డిపల్లి రవికుమార్, సుబ్బయ్య శాస్త్రి, ఎస్‌వీ ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న పూజారులు, భక్తులు

బాలోత్సవంలో సాయిశ్రీకి తృతీయ బహుమతి



మెమొంటో అందుకుంటున్న విద్యార్థిని

తాళ్లూరు: ప్రకాశం బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ ఒంగోలు పీవీఆర్ బాయ్స్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. చిత్రలేఖనం సబ్ జూనియర్స్ విభాగంలో జరిగిన పోటీలో తాళ్లూరు మండలం బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పోలంరెడ్డి జోషిక సాయిశ్రీ తృతీయ బహుమతి సాధించి నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంస పత్రం, మెమొంటో అందుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, పద్మావతి, ఉషారాణి పాల్గొన్నారు.

ఇళ్లలోనే కందులు.. ధర లేక దిగాలు

- ప్రారంభం కాని కందుల కొనుగోలు కేంద్రాలు
- దొనకొండ మండలంలో 7650 ఎకరాల్లో కంది సాగు
- దిగుబడి తగ్గి, మద్దతు ధర కరువైందని రైతుల వేదన

దొనకొండ: ఆరుగాలం శ్రమించి వ్యవసాయం చేసినా ఆశించిన దిగుబడి రాక దిగాలు చెందుతున్న రైతులు.. మద్దతు ధర లేకపోవడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. పండించిన కంది పంటను ఇళ్లల్లోనే నిల్వ చేసుకున్నారు. దొనకొండ మండలంలో సుమారు 7650 ఎకరాల్లో కంది పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. రుద్రసముద్రం, భూమనపల్లి, మంగినపూడి, అనంతవరం, ఇండ్లచెరువు, ఆరవల్లిపాడు, పెదన్నపాలెం, గుడిపాడు, గంగదేవిపల్లి, రామిరెడ్డిపల్లి, పోలేపల్లి గ్రామాల్లో రైతులు కంది పంట అత్యధికంగా సాగు చేశారు.

తగ్గిన దిగుబడి

ఎకరాకు సుమారు రూ.15 వేల నుండి రూ.20 వేలు ఖర్చు చేసి రైతులు కంది పంట సాగు చేశారు. తీరా పంట నూర్పిడి చేశాక దిగుబడి రెండు క్వింటాళ్లు మాత్రమే రావడంతో రైతులకు మనోవేదనే మిగిలింది. గత ప్రభుత్వంలో కంది పంట ఇళ్లకు చేరేలోపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించేవారు. దీంతో దళారుల వ్యవస్థ దాదాపు కనుమరుగైంది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం క్వింటా కందులకు మద్దతు ధర రూ.7,550 మాత్రమే ప్రకటించడం, నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో గ్రామాల్లో దళారుల వ్యవస్థ పెరిగిపోయింది. క్వింటా కందులను రూ.6 వేలకే అడుగుతుండటంతో రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. రైతులు పండించిన మిర్చి, పత్తి, కందుల ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. ఎన్నికల ముందు రైతులకు మద్దతు ధర ప్రకటిస్తాం, రైతుల సంక్షేమమే తమ ధ్యేయమంటూ వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత విస్మరించడంతో తీవ్ర స్థాయిలో విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా రైతులందరికీ న్యాయం చేసేలా గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.



గుడిపాడులో ఇంట్లో నిల్వ ఉంచిన కందులు

గిట్టుబాటు ధర కల్పించాలి



6 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. పెట్టుబడి కోసం సుమారు లక్ష రూపాయలు ఖర్చు చేశా. కందుల దిగుబడి మాత్రం 9 క్వింటాళ్లు వచ్చింది. అమ్ముకోవాలంటే ధర లేదు. రాష్ట్ర ప్రభుత్వం సరైన మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

– వెన్రి కోటిరెడ్డి, గంగదేవిపల్లి

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఈ సీజన్‌లో 9 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. దిగుబడి 10 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు అయింది. గతంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ఇచ్చారు. నేడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతిలో మోసపోవాల్సి వస్తోంది.

– బొరెడ్డి నాగిరెడ్డి, గంగదేవిపల్లి



ఘనంగా గంగాభవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవరప్పాడు గ్రామ పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటిగంగలో వేంచేసిన గంగాభవానికి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు కామేశ్వర శర్మ, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలోని మల్లికార్జున స్వామి, నాగమ్మ తల్లి విగ్రహాలను పూజించారు. ఆలయ చైర్మన్ కే.గురుబ్రహ్మం, ఈవో గుంటపల్లి వాసు పర్యవేక్షించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గుంటి గంగ అమ్మవారు